క్లుప్తంగా

సమానత్వ సాధనకై ఐక్యంగా పోరాడుదాం

కల్లూరు: సమాజంలో సమానత్వ సాధనకై పోరాడుద్దామని ఐద్వా సీనియర్ నాయకులు నిర్మలమ్మ, జిల్లా కార్యదర్శి అలివేలమ్మ పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో ఐద్వా బృందం పర్యటించగా.. కాలనీ వాసులు సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. వారు మాట్లాడుతూ కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రజలు కలిసి బతకాలని రాజ్యాంగం సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు సుజాత, ధనలక్ష్మి, అరుణ, సావిత్రి, రాధా, ఉమా తదితరులు పాల్గొన్నారు.

జపాన్ పర్యటనకు రెండో బెటాలియన్ కమాండెంట్

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మే 5 నుంచి 14వ తేదీ వరకు పది రోజుల పాటు వ్యక్తిగతంగా జపాన్ పర్యటనకు వెళ్లనున్నట్లు కమాండెంట్ దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కూడా జపాన్ పర్యటనకు వెళ్లేందుకు ఈనెల 15వ తేదీన ప్రభుత్వం అనుమతించిన సంగతి తెలిసిందే.

మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కల్లూరు : కల్లూరు అర్బన్ కాలనీలో గత కొన్ని రోజుల నుంచి తాగునీరు సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అశోక్ నగర్ పంప్ హౌస్, మునగలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

28 మంది మృతి బాధాకరం

కర్నూలు(అర్బన్): ఈ నెల 22వ తేదీన పహల్గాం లోని బైసరస్ మైదాన ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో దాదాపు 28 మంది మృతి చెందడం బాధాకరమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జమ్ము కాశ్మీర్ ప్రాంతాన్ని వేసవిలో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో సందర్శించేందుకు మొగ్గు చూపుతుంటారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసి, దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే ఉద్దేశంతో ఈ పాశవిక దాడి జరిగిందన్నారు. మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్లిష్ట సమయంలో దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తుల పట్ల అందరు ఒక్కటవ్వాలన్నారు.

ఏఎస్‌ఓగా వెంకటరాజు

కర్నూలు(సెంట్రల్):కర్నూలు డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్‌గా డిప్యూటీ తహశీల్దార్ వెంకటరాజు నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం కలెక్టర్ పి.రంజితబాషా ఉత్తర్వులు విడుదల చేయడంతో ఆయన విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పేదలకు చేరాల్సిన బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటామని, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

28న వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): నగరంలో ఈనెల 28వ తేదీన వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, నగర నాయకుడు డి.అబ్దుల్‌దేశాయ్, ఇంతియాజ్ తెలిపారు. బుధవారం అవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకునే వరకు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సేవ్ వక్ఫ్ పేరుతో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 28వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు ఇస్లామీయా అరబిక్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు భారీర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతంచేయాలని వారు కోరారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండించాలి

కశ్మీర్‌లో ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

న్యాయం చేయాలి

కర్నూలు కల్చరల్: బ్రాహ్మణ విద్యార్థులకు న్యాయం చేయాలని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, షిమోగా తదితర పట్టణాల్లో జరిగిన సెట్ పరీక్షల కేంద్రాల వద్ద పరీక్షలకు హాజరైన బ్రాహ్మణ విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం క్షమించరానిదన్నారు. సమావేశంలో సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి కల్లె చంద్రశేఖర్ శర్మ, ఉపాధ్యక్షులు ఇస్కాల సురేష్‌కుమార్, మెంబర్షిప్ కన్వీన ర్ హెచ్‌కె రాజశేఖర్ యువజన విభాగం ఉపాధ్యక్షులు సుందర రామశర్మ పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం సురేష్‌కుమార్



విజయకేతనం చూపుతున్న నారాయణ స్కూళ్ల ఏజీఎం రమేష్ కుమార్, విద్యార్థులు, ప్రిన్సిపల్స్



విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్



ఉత్తమ మార్కుల విద్యార్థులతో సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల అధినేత పీబీవీ సుబ్బయ్య



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సిరాక్ స్కూల్ అధినేత జీఎండీ ఇబ్రహీం

పది ఫలితాల్లో 'ప్రైవేటు' హవా



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీలక్ష్మి స్కూల్ చైర్మన్ పి.దీక్షిత్



సర్వేపల్లి స్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ పి.శేషన్న, డైరెక్టర్ దీక్షిత్

కర్నూలు(సిటీ) : పదవ తరగతి ఫలితాల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థుల హవా కొనసాగింది. బుధవారం విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎక్స్‌లో పది ఫలితాలు విడుదల చేశారు. ఇందులో పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు.

➤ **శ్రీచైతన్య** విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో సత్తాచాటినట్లు ఆ విద్యాసంస్థల ఏజీఎం సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలోఆయన పాల్గొని ప్రసంగించారు. తమ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పగిడాల గీతిక 597 మార్కులు, మాల దాసరి సాయి నందిని 596, వెంపల్లి రస్మిత రెడ్డి 596, రత్నపల్లి మను చరణ్ 596, అంగలి నేహా 596, తాళ్ల యాస్మిని 595 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు 597 మార్కులు ఒకరు,596 మార్కులు నలుగురు, 595 ఒకరు, 593 ముగ్గురు, 592 మార్కులు నలుగురు, 591 మార్కులు పది మంది, 590 మార్కులకుపైగా 31 మందికి, 580కిపైగా 123 మంది, 570కిపైగా 171 మంది, 575కి పైగా 171 మంది, 550కిపైగా 373 మంది, 500 మార్కులకుపైగా 692 మంది ఉన్నారన్నారు.

➤ **నారాయణ** విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ఆ స్కూళ్ల ఏజీఎం రమేష్‌కుమార్, క్లస్టర్ ప్రిన్సిపాల్స్ రామాంజనేయులు, అన్వర్‌బాషా, శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ విద్యా సంస్థలకు చెందిన స్కూల్లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. వెంకట కీర్తన 597, పి.రిజ్వానా 596, రిషిత వర్షిణి 595, జలీల్ మహమ్మద్ 595, సనా సమ్రీన్ 595, రిషిత సాయి 594, ఇమ్రాన్ నజీర్ 594, అదీప్ 593, సౌమ్య 593, అబ్రర్ 593, గగన దీపిక 592, హన్సిని 592, మిత్ర వింద 592, సాధియా సుహాస్ 591, లిఖిత్ కృష్ణారెడ్డి 591, అనీల 591, నాగ సత్యశ్రీ 591, బాల లక్ష్మీ సునయన 590 మార్కులు సాధించారన్నారు. 590 మార్కులకుపైగా 18 మంది, 580 మార్కులకుపైగా 53 మంది, 500కిపైగా మార్కులు 300 మంది సాధించారన్నారు. కార్యక్రమంలో ఆ విద్యా సంస్థలకు చెందిన ప్రిన్సిపల్స్ శాంత, సత్యనారాయణ రెడ్డి, దినేష్‌కుమార్, అల్తాఫ్, నిజేంద్ర, అజీజ్, కో–ఆర్డినేటర్ శ్రీహరి, నాగార్జున రెడ్డి, భాగ్యలక్ష్మి, ఏఓలు, అకడమిక్ డీన్స్, తదితరులు పాల్గొన్నారు.

సాయి సుబ్బయ్య రవీంద్ర..

స్థానిక మాధవీ నగర్, రెవెన్యూ కాలనీల్లోని సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థలకు చెందిన రవీంద్ర ఇంగ్లిషు మీడియం, రవీంద్ర టాలెంట్ స్కూళ్ల విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ విద్యా సంస్థలకు చెందిన కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య తెలిపారు. సీహెచ్ పిజ్వల్ 584 మార్కులు, పి.చరణ్ 579 మార్కులు, మునవ్వర్ హుస్సేన్ 572 మార్కులు, యశ్వంత్ 570, అబ్దుల్ అఫాన్ 568, కె.తేజేశ్వర్ 568, కె.భావన 566, కె.జగన్ 565, సి.పార్వతమ్మ 563 మార్కులు, కె.ఉమేష్ 555, ఎస్.రుహీనా మహీన్ 553 మార్కులు, బీజే తరుణ్ 550 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు 500 మార్కులకుపైగా 21 మంది సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ఆ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ శారత దేవి, కో–ఆర్డినేటర్లు బాలు, సుభద్ర, నాగేంద్ర, సౌజన్య, అక్తర్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యా మందిర్..

స్థానిక మారుతి నగర్‌లోని ఆదర్శ విద్యా మందిర్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ బి.తిమ్మయ్య , డైరెక్టర్ డా.బి. హరికిషన్, ప్రధానోపాధ్యాయురాలు బి.రమామాధవి తెలిపారు. టి.వినయ్ కుమార్ 552 మార్కులు, బి.సాయి చరణ్ 551 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు అత్యధిక శాతం మంది విద్యార్థులు 500 మార్కులు సాధించారని, ఇందుకు కారణమైన ఉపాధ్యాయులను, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

రవీంద్ర విద్యార్థుల ప్రతిభ...

రవీంద్రా విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పదిలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులయినట్లు ఆ విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్ తెలిపారు. ఆ విద్యా సంస్థల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.జి.ధరణి 594 మార్కులు,ఏ.తేజస్వి 594 మార్కులు, ఎస్.కీర్తన 592, కె.పవన్‌కుమార్ ఆచారి 591, మీనాక్షి బాయ్ 590, యశ్విత చౌదరి 590, శివ సాయి కేశవ 590 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు 550కిపైగా 77, 500కిపైగా 127 మంది, 450కిపైగా 161 మంది విద్యార్థులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఆ విద్యా సంస్థల అకడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్, వైస్ చైర్మెన్ వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ హార్ట్స్..

స్థానిక విష్ణుటౌన్‌షిప్‌లోని లిటిల్ హార్ట్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌కి చెందిన విద్యార్థులు పది ఫలితాల్లో సత్తా చాటారని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ టి.సీలిమా తెలిపారు. అభినందన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సాయి ప్రసన్న 591 మార్కులు, మహేష్ 560, చైతన్య 557, హర్షిత 554, షణ్ముఖ 547 మార్కులు, జ్యోషిత 547, హనీఫ్ 545, ఫర్హానా 528, జ్యోష్నా 511 మార్కులు సాధించారన్నారు. మార్కులు సాధించిన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ రాఘవేంద్ర, ఇన్‌చార్జ్ నాగలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

సిరాక్ స్కూల్

సిరాక్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ఆ స్కూల్ అధినేత జీఎండీ ఇబ్రహీం తెలిపారు. అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కనీఫా ఫాతిమా 594 మార్కులు, సాత్విక్ గౌడ్ 591, మహమ్మద్ ఫహాద్ 587, ఆలియా జైమా 585 , నశ్రీన్ 585 మార్కులు సాధించారన్నారు. 585 మార్కులకుపైగా ముగ్గురు, 550 మార్కులకుపైగా 19 మంది, 500కిపైగా 36 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మేరి స్వప్న, సంగీతం మాస్టర్ రమేష్ బాబు, టీచర్లు శ్రీనివాసులు, రియాజ్, నవీన్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్రతిభ స్కూల్..

ప్రతిభా విద్యా సంస్థల విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ అరుణాచలం రెడ్డి తెలిపారు. అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సి.కల్పన 579, మమత 576, ఎస్.గంగోత్రి 567, సి.ప్రియాంక 563, వి.నందిని 562, ఎస్.కృపాసాగర్ 561, మధుర వాణి 523, హాసన్ వలి 518, కె.సాయి చరణ్ తేజ్ 518, కె.శ్యామ్ సుందర్ గౌడ్ 514, వేణుమ 511, యశ్వంత్ రాజ్ 508 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సి.వి. శ్రీదేవి పాల్గొన్నారు.

➤ **సెయింట్ లూర్ద్స్** ఇంగ్లిషు మీడియం స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వేల్పుల సుదర్శన్ తెలిపారు. 18 మంది విద్యార్థుల్లో 14 మంది మొదటి శ్రేణిలో, 3 ద్వితీయ, ఒకరు తృతీయ శ్రేణిలో పాసయ్యారన్నారు. వీరిలో శ్రీధర రాఘవేంద్ర భరత్ 564 , మొల్ల సన ఆఫ్రీన్ 552, గొంగ్ల ప్రశాంత్ 545 మార్కులు సాధించారన్నారు.

➤ స్థానిక శరీన్‌నగర్, రాఘవేంద్ర నగర్‌లోని బ్రేక్ త్రూ ఇంగ్లిషు స్కూల్‌కి చెందిన విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యారని ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుగుణ అన్నె రోస్లిన్ తెలిపారు. 28 మంది విద్యార్థుల్లో అత్యధిక శాతం మంది 500 మార్కులకుపైగా సాధించారన్నారు.

➤ **ఇండస్** ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ స్కూల్ అధినేత కేఎస్‌వీ రాజశేఖర్, కరస్పాండెంట్ డా.గాయని రాజశేఖర్ తెలిపారు. జి.లక్ష్మారెడ్డి 593, పి.క్రిస్ కెవిన్ 588, బి.గణేష్ 586 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు అత్యధిక శాతం మంది విద్యార్థులు మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు.

'శ్రీలక్ష్మి' అత్యుత్తమ ప్రతిభ

స్థానిక ఎస్.ఆర్ పేటలోని శ్రీలక్ష్మి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కి చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ఆ స్కూల్ చైర్మెన్, డైరెక్టర్ పి. దీక్షిత్ తెలిపారు. ఇల్లూరు బ్రహ్మణి 592 మార్కులు, సి.కార్తీక 592 మార్కులు, కె.లక్ష్మీ 592 మార్కులు, ఐమాన్ రాబీ 590 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు 100 మందికిపైగా 500 మార్కులు సాధించిన వారు ఉన్నారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. తమ స్కూల్‌లో అనుభవజ్ఞులైన టీచర్లు ఉండడం, క్రమ శిక్షణతో కూడిన ప్రణాళిక అమలు చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు.

సత్తాచాటిన 'సర్వేపల్లి'

స్థానిక కృష్ణానగర్‌లోని సర్వేపల్లి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పది పరీక్షల ఫలితాల్లో సత్తా చాటారని ఆ విద్యా సంస్థ డైరెక్టర్, కరస్పాండెంట్ పి.శేషన్న, ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.పి అరుణశ్రీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.దీక్షిత్ తెలిపారు. ఎస్.సమ్రీన్ 592 మార్కులు, ఎస్.ఆఫీఫా తసీన్ 578 మార్కులు, సి.కృష్ణా 571 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు తమ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు 50 శాతం మంది 500 మార్కులకుపైగా సాధించినట్లు వారు వెల్లడించారు. మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు, అందుకు కారణమైన ఉపాధ్యాయులను వారు అభినందించారు.

మాంటిస్సోరి విద్యాసంస్థలో..



పి.ఆఫ్రన్ అల్మాస్



షేక్ షబాజ్ నేహాన్



జి.సాయి చైతన్య

మాంటిస్సోరి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ఆ విద్యా సంస్థల డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆ స్కూళ్లలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 142 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 141మంది ఉత్తీర్ణులయ్యారని, ఇందులో పి.ఆఫ్రన్ అల్మాస్ 591,షాబాజ్ నేహాన్ 590 మార్కులు, జి.సాయి చైతన్య 585 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో రమాజ్యోతి, సమన్వయకర్తలు కల్యాణి, లక్ష్మీకాంత రెడ్డి పాల్గొన్నారు.

పోషక లోపాలను గుర్తించి నయం చేయాలి

కర్నూలు(హాస్పిటల్):చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపాలను గుర్తించి వారిని ఆరోగ్యవంతులుగా చేసేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. బుధవారం కల్లూరు మండలం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నటేకూరు గ్రామం సచివాలయంలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయి పర్యవేక్షకురాలు మద్దమ్మ, సామాజిక ఆరోగ్య అధికారి బిందు, ఆరోగ్య కార్యకర్త విజయకుమారి, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల అభివృద్ధిపై దృష్టి సారించండి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఉద్యాన పంటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జీలను ఆదేశించారు. బుధవారం కర్నూలులోని ఉద్యానభవన్‌లో కర్నూలు, కోడుమూరు డివిజన్లలోని రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జీలకు పండ్లతోటల అభివృద్ధికి అర్హులైన రైతులను గుర్తించడం, చౌడు భూముల్లో పండ్లతోటల అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో సాగుకు అనుకూలమైన బీడు భూములను గుర్తించాలని సూచించారు. వాటిలో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై కింద ఉద్యాన పంటల సాగుకు రైతులను గుర్తించాలని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు జిల్లాలో అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేయాలని తెలిపారు. డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ నందకిశోర్ మాట్లాడుతూ.. ఉపాధి నిధులతో 2400 హెక్టార్లలో 100 శాతం సబ్సిడీతో పండ్లతోటల అభివృద్ధికి అవకాశం ఉందని, జాబ్‌కార్డు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతుల్లో అర్హులైన వారిని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు, కోడుమూరు డివిజన్ల ఉద్యాన అధికారులు నరేష్‌కుమార్‌రెడ్డి, మదన్‌మోహన్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలను అరికట్టాలి



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రసూతి మరణాలు సంభవించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్య, ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రసూతి మరణాలకు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అక్టోబర్ 22 నుంచి ఇప్పటి వరకు 6 మాతృ మరణాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించి తగు కారణాలను వైద్యులు, ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ మొదలు బీపీ, హిమోగ్లోబిన్, బరువు తదితర అంశాలపై శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ శాంతికళ పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ

వేసవి సెలవుల్లో 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు వర్చువల్ విధానంలో వివిధ అంశాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లుల కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో నైపుణ్య శిక్షణకు సంబంధిచిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, డీఈఓ శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

కర్నూలు (టౌన్) : ఈ నెల 2, 3 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 5 వ ఏపీ స్టేట్ క్యాడెట్ అండర్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటి పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. బాలికల విభాగంలో బి. లేఖ్య శ్రీ చందన, సుగంధిని (బంగారు), జూనియర్ బాలుర విభాగంలో ఇర్ఫాన్ అహ్మద్ (బంగారు) అలాగే షేక్ గోరె మహమ్మద్ అద్నాన్, కౌస్తుబాలు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్, డీఎస్‌డీవో భూపతిరావు పాల్గొన్నారు.

ఉగ్రదాడి పిరికి పంద చర్య

కర్నూలు (టౌన్) : అమాయక ప్రజలపై ఉగ్రవాదులు జరిపిన దాడిని పిరికిపంద చర్య, అని దీనిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆపార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హఫీజ్ మహమ్మద్ ఇలియాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాడులు మరోసారి జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

మృతులకు నివాళి

కర్నూలు (సెంట్రల్) : కాశ్మీర్‌లో సామాన్య ప్రజలను పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్చి చంపడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జనసేన నాయకుడు సుబ్బయ్య పేర్కొన్నారు. ఇది ఉగ్రవాదుల పిరికిపంద చర్య అని అభివర్ణించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట ఉగ్రవాదుల చేతుల్లో హతమైన మృతులకు క్యాండిల్ సర్వీసు నిర్వహించి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వాసురెడ్డి, ప్రతాపరెడ్డి, అర్షద్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు టి.రాముడు, ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. ఈనెల 28వ తేదీన సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

నేడు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

కర్నూలు కల్చరల్: కాశ్మీర్‌లోని ఉగ్రదాడి నిరసిస్తూ గురువారం సాయంత్రం జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ గాంధీ విగ్రహం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి పేర్కొన్నారు. బుధవారం వినాయక సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హిందూ పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు రాజేశ్ శర్మ, వివిధ సంఘాల నాయకులు భాను ప్రకాష్, ఈపూరి నాగరాజు, కాశీ విశ్వనాథ్, గిరిబాబు, నీలి నరసింహ, నాగరాజు, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సేవలందించాలి

కర్నూలు (అర్బన్) : గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి పి.నిర్మల తెలిపారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంపై కర్నూలు ఐసీడీఎస్ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం యొక్క ప్రయోజనాలను పొందేందుకు గర్భిణులు పేర్లను నమోదు చేసే సమయంలో ఎలాంటి అవాంతరాలకు తావు ఇవ్వరాదన్నారు.అనంతరం డైరెక్టర్ వారి కార్యాలయ జెండర్ స్పెషలిస్టు మహంతి మాట్లాడారు.

బైపీసీ వారికి పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశం

కర్నూలు(హాస్పిటల్): ఇంటర్ బైపీసీ 2024లో పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ పారామెడికల్, నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 26వ తేది వరకు అవకాశం ఉందన్నారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం కల్పించి ఫీజును జీతం నుంచి మినహాయిస్తామన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ నెల 26వ తేది సాయంత్రం 3 గంటల్లోగా 7995013422, 7680945357 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లో ఉన్న బొల్లినేని మెడ్ స్కిల్స్‌లో సంప్రదించాలని సూచించారు.

25 నుంచి ప్రహ్లాద బడి

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రహ్లాద బడి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందసేవక ప్రభు తెలిపారు. ఇస్కాన్‌పూరి జగన్నాథ మందిరంలో మూడు వారాల పాటు ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. భగవద్గీత శ్లోకాలు మృదంగం, అన్నమయ్య కీర్తనలు, జపం, కరతాళాలు, క్రాఫ్ట్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడి దారుణం

● వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కొవ్వొత్తుల ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు

కల్లూరు: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం, బైసన్ ప్రాంతంలో అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడి దారుణమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఉగ్రవాద దాడిని ఖండిస్తూ బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ చెన్నమ్మ సర్కిల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఈ అమానుష దాడిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చంద్రమౌళి, మధుసూదన్‌తో పాటు మొత్తం 28 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ సందర్భంగా మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య సిబ్బందితో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం జరిగితే అగ్నిమాపక యంత్రాలు ఏ విధంగా ఉపయోగించాలి, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా సత్వర చర్యలు ఎలా తీసుకోవాలనే అంశంపై హౌస్‌సర్జన్లు, సెక్యూరిటీ, శానిటేషన్, నర్సింగ్ సిబ్బందితో మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఎస్‌పీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రిబాయి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.